

# పగిలిన అద్దాలు

రామా చంద్రమౌళి

అప్పారావు మళ్ళీ అప్పుచేశాడు. యిరవై రూపాయలు...నోట్లను గబగబా లెక్కపెట్టుకుని "థాంక్యూ బ్రదర్ ఫస్టున యిస్తాను" అని యింకా గబగబా పలికి కామేశం గదిలోనుండి బయట పడ్డాడు.

కామేశాన్ని అప్పు అడగడానికి గదిలోకి వెళ్ళేప్పుడు అప్పారావు ముఖం గాలితీసిన రబ్బరు బుడగలా ఉంది. యిప్పుడు అతని ముఖం అప్పుడే వెలిగిన కొత్త ట్యూబ్ లైటులా ఉంది.

చాలా హుషారుగా బయటకొచ్చి కిళ్ళీ షాపు దగ్గరికెళ్ళి తను రోజూ తాగే విజయ్ సిగరెట్టు ప్యాకెట్టు ఒకటిమ్మనబోయి - చటుక్కున మాలతి జ్ఞాపకమొచ్చి...తర్వాత ఆమెముందు తాను ప్రదర్శించాల్సిన స్టేటస్ జ్ఞాపకమొచ్చి ఓ కింగ్‌సైజ్ విల్స్‌ఫ్లాక్ యిమ్మన్నాడు.

ఓ సిగరెట్టును చాలా విలాసంగా వెలిగించుకుని...నాల్గడుగులు నడిచి బస్‌స్టాండ్‌లోకి వచ్చి...టైం చూసుకునేందుకు చేయి వంక చూచుకుని...నాల్గు రోజుల క్రితమే తను దాన్ని నలభై రూపాయలకు కుదువ బెట్టిన సంగతి గుర్తొచ్చి...ఎవరో ప్రక్క నిలబడ్డ వాన్ని "ఎక్స్‌క్యూజ్ మి— టైమ్..." అన్నాడు.

"ఫోర్ థర్టీఫైవ్"

"ఓ థాంక్యూ—" తను చాలా నాగరి

స్టయిల్‌గా అన్నందుకు గర్వపడి—

మాలతి... మాలతి... ఆ ఫేస్‌లో తన ఎదుటి సీట్‌లో కూర్చుని పనిచేసే మాలతి - కొత్తగా వచ్చిన, అప్పుడే తెంపిన ఆపిల్ పండులాంటి మాలతి—

మాలతి తనకోసం ఎదురు చూస్తూ ఉంటుంది.

తను ఆమెతో మాట్లాడగానే...ఆమె నవ్వి...

తను ఆమెతో 'మీ స్నేహం కావాలంటే'- అని అనగానే...ఓయస్ అన్నట్టు చూసి...

తను ఆమెను యీ ఆదివారం తనకోసం వలానా చోటికి రండి - అనగానే వచ్చేందుకు ఒప్పుకుని—

మాలతి నిజంగా తనను...

అప్పారావు మెదడులో పూలు విచ్చుకుంటున్నాయి తెలుగు సినిమాల్లో ప్రణయ సన్నివేశాల్లోలా.

తను వెళ్ళాలి...వెళ్ళాలి—

కాని ఎలా...బస్ పైననా...ఛీఛీ.

మరి తను రోజూ బస్ పైననే వస్తున్నాడు గదా.

ఐతే నేమిటి—యివ్వాళ మాలతి దగ్గరికి...

"ఏయ్ ఆటో, చలే—"

"ఆఁ..."

ఎక్కి కూర్చుని "పబ్లిక్ గార్డెన్‌ఛలో—" అన్నాడు.

ఆటో రోడ్డుమీద పరుగెడుతోంది.

అతని ఆలోచనయి ఆకాశంలో పరుగెడుతున్నాయి.

ఆటోను పబ్లిక్ గార్డెన్‌లోకి పోనిచ్చి మాలతిని తను ఉండమన్న చోటు దగ్గరికి తీసుకుపోయి...

ఆమె వచ్చింది...వచ్చి తనకోసం ఎదురు చూస్తోంది..."ఓహ్..."

ఆటోను ఆమె ముందర ఆపి...దిగి...

హుందాగా పది రూపాయలనోటిచ్చి ఏడు రూపాయలను తీసుకుని—"హాయ్...ఎంత సేపయింది వచ్చి...సారీ ఫర్ లేట్..." అని... ఆమె కన్నుల్లోకి చూడబోయి...

"నేను యిప్పుడే వచ్చానండీ..."

"ఇలా కూర్చుందామా..."

"ఓ—"

కూర్చున్నారు యిద్దరూ ఓ మూల... పచ్చిక పైన.

అప్పారావు చాలా పాలిష్డ్ విషయాలు మాట్లాడాడు ఆమెతో. అమెరికాలో ప్రజల లైఫ్ గురించి...యింగ్లీషు సినిమాల గురించి యింటర్నేషనల్ పాలిటిక్స్ గురించీ— ఎన్నో.

మాటల మధ్య ఓసారి ఐస్‌క్రీం...మరోసారి చెరకురసం యిప్పించి...ఓ నాల్గుసార్లు ఆమె ఒంటిని తాకేందుకు ప్రయత్నించి...

ఓ గంట తర్వాత...అమాయకంగానవ్వే ఆమెతో 'సినిమాకెళ్దామా' అన్నాడు మనసు కత్తుల బోను గేటు తెరుస్తూ.

ఆమె సరేనంది.

లేచి—గేట్‌దాకా యిద్దరూ నడచి—

"ఏయ్ ఆటో..." అరిచాడు.

ఆటోలో ఎక్కి...ఆమె ఒంటిని తాక

గలుగుతున్నందుకు అప్పుడే బ్రహ్మర్షిపదవిని పొందిన విశ్వామిత్రుడిలా పొంగిపోతూ—

ఓ పది నిమిషాల తర్వాత - హోటల్ సరోవర్‌లో ఆపి...రెండు కప్పులు కాఫీ తాగి - మళ్ళీ ఆటో ఎక్కి "లిబర్టీ ఛలో" అన్నాడు.

ఆని..."నేను యింగ్లీష్ తప్ప వేరే సినిమాలు చూడనండీ" అని నవ్వుతూ చెప్పాడు.

"అలాగా" అందామె.

"ఊ..." చాలా గర్వపడిపోయాడు తను ఎంతో కల్చర్డ్‌గా మాట్లాడగలుగుతున్నందుకు.

లిబర్టీలో 'ఎ థౌజండ్ ఎండ్ వన్ నైట్స్'—ఆడుతోంది.

ఆటో ఫేరిచ్చి—గబగబా వెళ్ళి రెండు అప్పర్ క్లాస్ టికెట్లు తీసుకొచ్చి...అప్సరసను వెంటతీసుకుని నడుస్తున్న దేవేంద్రుడిలా లోపలికెళ్ళి—

లైట్లు ఆరిపోయి...చీకటి ఆవరించాక...

చీకట్లో ఆమె చేయిని తన చేతిలోకి తీసుకుని...ఆమె భుజంపై తన చేయివేసి.. చుట్టేసి...దగ్గరగా అదుముకుపోయి... చెంపకు చెంప ఆనించి...యింకా ఏదేదో చేయాలనుకుని— ఏదీ చేయలేక... ఆమె చేయిని తన చేతిలోకి లాక్కుంటూంటే—

మాలతి చివాలునలేచి—బయటికి నడచి.. ఆమె వెంట పరుగెత్తాడు—

"ఏయ్ రిక్షా—" పిలుస్తోంది ఆత్రంగా.

"ఏయ్ మిస్టర్...ఏదో కొలీగ్‌వని... కల్చర్డ్ బ్రూట్‌వనీ చనువుగా ఉంటే యిదా నువ్వు చేసేది—థూ..."

రిక్షా ఎక్కింది.

రిక్షా కనుచూపుమేర దాటిపోయేదాకా చూస్తూ నిలబడిపోయి జేబులు చూసుకుంటే అర్ధరూపాయుంది... అప్పటినుండి పందొమ్మిదిన్నర ఖర్చు చేశాడన్నమాట తను.

అప్పారావు తల తిమ్మిరిగా ఉంది.

నడుస్తున్నాడు ఉడికిన తోటకూర కాడలా వ్రేలాడబడిపోయి.

యింట్లోకి వచ్చిన అప్పారావు బట్టలు విడిచి, ముఖం కడుక్కుని రాగానే...అన్నం వడ్డించి- "ఎక్కడికెళ్ళారండీ యిప్పటి దాకా...మీకోసం అన్నం తినకుండా ఎదురు చూస్తున్నాను అప్పటినుండి - ఆకలేస్తోంది. మీరు రారు..." అంటోంది అతని భార్య.

ఆమెను నువ్వుకూడా తిను అని అనలేదు అతను.

"రోజా పాప బోడికాళ్ళతో వెళ్తోంది బడికి. దానికి ఓ రెండు మూడు రూపాయలు పెట్టి చెప్పులు తేవాలి. కాళ్ళు కాలుతున్నాయంటోంది. అసలే ఎండలు మండుతున్నాయి—"

"......" తలెత్తి చూశాడు ఆమెవంకే.

నాక్కూడా పూర్తిగా రెండే జాకెట్లయిపోయాయి. ఓ నూలు గుడ్డయినా వట్టండి-" అంటోంది దీనంగా.

"అసలు యింట్లోకి రావాలా వద్దా-" అని అరిచాడు విసురుగా—అరిచి చరచరా లేచి పోయాడు భోజనం పైనుండి.

అప్పారావు భార్య అతని మనసును నొప్పించినందుకు నిశ్శబ్దంగా ఏడుస్తోంది వంట గదిలో. *